ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

జయశంకర్ భూపాలపల్లి

ములుగు

శుక్రవారం 12 జూలై 2024



యువకుడి.. ఉన్మాదం

ప్రేమించి పెళ్లి చేసుకున్న యువతి తల్లిదండ్రులపై వేటకత్తితో దాడి



నిందితుడు మేకల నాగరాజు



- భార్యను దూరం చేశారన్న కక్షతో నరికి చంపిన వైనం
- గాఢ నిద్రలో ఉండగా ఘాతుకం
- భార్య, ఆమె సోదరుడిపైనా దాడి.. తీవ్రగాయాలు
- వరంగల్ జిల్లా పదహారు చింతల్‌తండాలో ఘటన



బానోతు శ్రీనివాస్ మృతదేహం



సుగుణ మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు



సుగుణ, శ్రీనివాస్ దంపతులు (ఫైల్)

చెన్నారావుపేట, జూలై 11: కూతురి ప్రేమ, పెళ్లి వ్యవహారం ఆ దంపతుల దారుణ హత్యకు దారి తీసింది. ప్రేమించి పెళ్లి చేసుకున్న తమను పెద్దల్లో పంచాయితీ పెట్టి విడదీశారని యువతి తల్లిదండ్రులపై కక్ష పెంచుకున్న ఆ యువకుడు.. వారి పాలిట కాలయముడయ్యాడు. గాఢ నిద్రలో ఉన్న వారిపై వేట కత్తితో విచక్షణారహితంగా దాడి చేసి హత మార్చాడు. ఇక ఈ దాడిలో ఆ యువకుడి భార్య, ఆమె సోదరుడు తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్నారు. వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం పదహారుచింతల్ తండాలో జరిగిన గురువారం తెల్లవారుజామున జరిగిన ఈ దారుణ ఘటన కలకలం రేపింది. పోలీసులు, గ్రామస్థుల తెలిపిన వివరాల ప్రకారం.. పదహారు చింతల్ తండాకు చెందిన బానోతు శ్రీనివాస్ (40) బానోతు సుగుణ (35) దంపతులకు ఓ కుమార్తె, ఓ కుమారుడు ఉన్నారు. గ్రామంలోనే వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్న ఆ దంపతుల కూతురు దీపిక హనుమకొండలోని పింగిళి కళాశాలలో డిగ్రీ రెండో సంవత్సరం, కుమారుడు మదన్‌లాల్ అమీనాబాద్ మోడల్ పాఠశాలలో ఇంటర్ సెకండియర్ చదువుతున్నారు. ఇక గీసుకొండ మండలం కొమ్మాలకు చెందిన మేకల నాగరాజు(బన్నీ) అనే యువకుడు మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం గుండెంగ గ్రామంలోని తన అమ్మమ్మ ఇంటి వద్ద ఉంటూ ఆటోడ్రైవర్‌గా పని చేస్తూ.. నిత్యం గుండెంగ నుంచి నెక్కొండకు ఆటోను నడుపుతుంటాడు. అయితే గతంలో

మిగతా 7వ పేజీలో..

నర్సంపేటలో ఉద్రిక్తత

'చింతల్‌తండా' మృతుల కుటుంబానికి న్యాయం చేయాలంటూ గ్రామస్థుల రాస్తారోకో

ఆందోళనకారులను కలెక్టర్‌తో మాట్లాడించిన డీసీపీ.. ఆందోళన విరమణ

7

ఆంజనేయ స్వామి గుడి నేలమట్టం

- లారీ ఢీకొనడంతో ఘటన
- మద్యం మత్తులో లారీ డ్రైవరు



నేలమట్టమైన ఆంజనేయస్వామి విగ్రహం

వాజేడు, జూలై 11: లారీ ఢీకొనడంతో ఆంజనేయ స్వామి గుడి నేలమట్టమైంది. ఈ సంఘటన మండలంలోని జగన్నాథపురంలో గురువారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తమిళనాడు నుంచి ఛత్తీస్‌గఢ్ వైపు కొత్త ట్రాక్టర్ల లోడుతో వెళ్తున్న లారీ జాతీయ రహదారి పక్కన జగన్నాథపురంలో ఉన్న ఆంజనేయ స్వామి ఆలయాన్ని ఢీకొంది. దీంతో ఆలయం పూర్తిగా నేలమట్టమైంది. డ్రైవరు మద్యం మత్తులో ఉండటం వల్లే ఈ ప్రమాదం జరిగిందని తెలుస్తోంది. గుడిని ఢీకొన్న అతడు అక్కడి నుంచి పరారయ్యేందుకు ప్రయత్నించగా గ్రామస్థులు బైకులతో వెంబడించి చీకుపల్లి వంతెన వద్ద పట్టుకొని వాజేడు ఎస్సై హరీశ్‌కు సమాచారం అందించారు. డ్రైవరుపై కేసు నమోదు చేసిన పోలీసులు లారీని స్టేషన్‌కు తరలించారు. నేలమట్టమైన ఆలయాన్ని ఎస్సై పరిశీలించారు. ఈ ఘటన సమయంలో బస్సులు, ఆటోల కోసం వేచియుండే ప్రయాణికులు ఉంటే ప్రాణనష్టం వాటిల్లేదని స్థానికులు అంటున్నారు.

నల్లబ్యాడ్జీలతో న్యాయవాదుల నిరసన



ములుగు జిల్లా కోర్టు ఆవరణలో నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

ములుగు కలెక్టరేట్, జూలై 11: సిద్దిపేట కోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్న రవికుమార్‌పై ఏఎస్సై ఉమారెడ్డి దాడిచేయడాన్ని ఖండిస్తూ ములుగులోని జిల్లా కోర్టు ఆవరణలో గురువారం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరసనకు దిగారు. న్యాయవాదులు నల్లబ్యాడ్జీలు ధరించి ఆందోళన చేపట్టారు. రవికుమార్‌పై దాడిచేసిన ఏఎస్సై ఉమారెడ్డిపై ప్రభుత్వం తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని, విధుల నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మసరగాని వినయ్‌కుమార్, కార్యదర్శి సునీల్, న్యాయవాదులు ఎం.వెంకటేశ్వర్‌రావు, సారంగపాణి, బి.చంద్రయ్య, ఆర్.భిక్షపతి, కొండి రవీందర్, చిరంజీవి, ప్రతాప్, అశోక్, రాజేందర్, విజయ్‌కుమార్, మన్సూర్ అలీ, మాధవశంకర్, కుమారస్వామి, సుష్మిత, అర్చన, నవత, రజిత, మానస తదితరులు పాల్గొన్నారు.

మేడిగడ్డ బ్యారేజీకి కొనసాగుతున్న వరద

43,500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

మహదేవపూర్ రూరల్, జూలై 11 : కాళేశ్వరం ప్రాజెక్టులో ప్రధానమైన మేడిగడ్డ బ్యారేజీకి వరద ప్రవాహం కొనసాగుతోంది. బ్యారేజీకి ఎగువన వర్షాలు విస్తారంగా కురుస్తుండటంతో ప్రాణహిత నుంచి వచ్చే వరద క్రమంగా పెరుగుతూ వస్తోంది. బ్యారేజీలోకి బుధవారం ఇన్‌ఫ్లో 41,500క్యూసెక్కులు ఉండగా గురువారం 43,500కు చేరింది. బ్యారేజీలోని 85గేట్లను ఎత్తే ఉంచిన అధికారులు వచ్చిన నీటిని వచ్చినట్లే దిగువకు పంపిస్తున్నారు.

కీలక ఫైళ్లు బుగ్గిపాలు!

- ఆర్డీవో కార్యాలంలో అగ్ని ప్రమాదం
- కాలిపోయిన పలు రికార్డులు, పట్టా పాస్‌బుక్కులు
- కాళేశ్వరం డాక్యుమెంట్లు సైతం దగ్ధం!
- ఘటనపై వ్యక్తమవుతున్న అనేక అనుమానాలు
- విచారణ చేపట్టిన పోలీసులు





కార్యాలయంలో కాలిపోయిన బీరువా, దగ్ధమైన ఫైళ్లు

కృష్ణకాలనీ (భూపాలపల్లి), జూలై 11: భూపాలపల్లి ఆర్డీవో కార్యాలయంలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. బుధవారం అర్ధరాత్రి వేళ మంటలు చెలరేగి కీలక ఫైళ్లు దగ్ధమయ్యాయి. ప్రమాదం జరిగి 12 గంటలు దాటాకే ఈ ఘటన వెలుగులోకి రావడం పలు అనుమానాలకు తావిస్తోంది. కార్యాలయంలోని బీరువాలో భద్రపరిచిన కీలకమైన ఫైళ్లు దగ్ధమయ్యాయి. వీటిలో మేడిగడ్డ భూసేకరణ రికార్డులు సహా సింగరేణి భూసేకరణ దస్త్రాలు, తాడిచర్ల, కాపురం కన్వేయర్ బెల్టు, జంగేడు, భూపాలపల్లి కన్వేయర్ బెల్టుకు సంబంధించిన రికార్డులు, రైతులకు చెందిన సుమారు 300 పట్టా పాస్‌బుక్కులు ఉన్నట్టు తెలుస్తోంది. అర్ధరాత్రి ఈ ఘటన జరిగినట్టు చెబుతున్నా గురువారం ఉదయం 11 గంటల వరకు ఈ ప్రమాద వివరాలు బయటకు పొక్కకుండా అధికారులు గోప్యత పాటించడం అనేక అనుమానాలకు తావిస్తోంది. సిబ్బంది కాపలా ఉన్నప్పటికీ ఫైళ్లు దగ్ధమయ్యే వరకు అప్రమత్తం కాకపోవడంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఈ వ్యవహారం వెనుక కుట్రదాగి ఉండొచ్చని పలువురు అభిప్రాయ పడుతున్నారు. ఈ నేపథ్యంలో పోలీసులు వెంటనే క్లూస్‌టీంను రంగంలోకి దింపి ఘటన స్థలంలో క్షుణ్ణంగా పరిశీలించి ఆధారాలను సేకరించారు. అదే సమయంలో పోలీసు, అగ్నిమాపక అధికారులు ఘటన జరిగిన తీరుతెన్నులను క్షుణ్ణంగా పరిశీలించారు. రెవెన్యూ అధికారులు చెబుతున్నట్టు షార్ట్‌సర్క్యూట్ వల్ల ఈ ప్రమాదం చోటు చేసుకుందా.. మరెవరి ప్రమేయమేదైనా ఉందా? అనే కోణంలో దర్యాప్తు జరుగుతున్నట్లు తెలిసింది. దగ్ధమైన రికార్డులకు సంబంధించి అధికారులను మీడియా వివరణ కోరే ప్రయత్నం చేయగా ఫైళ్లన్నీ సాఫ్ట్ కాపీల రూపంలో ఇప్పటికే భద్రపరిచి ఉన్నామనే సమాధానం వచ్చింది. అయితే.. ఈ రికార్డుల దగ్ధం వెనుక అదే కార్యాలయంలో పనిచేస్తున్న ఓ అధికారి ప్రమేయం ఉందనే గుసగుసలు వినిపిస్తున్నాయి. ఉద్దేశపూర్వకంగానే ఆయన ఈ పనిచేసి ఉంటాడని అదే కార్యాలయానికి మరికొంత మంది సిబ్బంది చర్చించుకోవడం గమనార్హం.

తప్పుడు వార్తలు రాశారని..

- సబ్‌కోర్టు ఉద్యోగి ఆత్మహత్య
- మృతదేహంతో కుటుంబ సభ్యుల రాస్తారోకో
- కారకులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్





మృతదేహంతో కుటుంబ సభ్యులు, మృతుడు రాందాస్ (ఫైల్)

కృష్ణకాలనీ (భూపాలపల్లి), జూలై 11: భూపాలపల్లి సబ్ కోర్టు ఉద్యోగి బలవన్మరణానికి పాల్పడ్డాడు. తనపై కొన్ని దిన పత్రికల్లో (ఆంధ్రజ్యోతి కాదు) నిరాధారమైన వార్తా కథనాలు ప్రచురితం చేశారంటూ మనస్తాపానికి గురై పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో కుటుంబ సభ్యులు నిరసనకు దిగారు. తప్పుడు వార్తలు రాసిన ఆ పత్రికలతోపాటు ఇందుకు ప్రేరేపించిన ఇద్దరు మహిళలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ రాస్తారోకో చేశారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలో ఈ సంఘటన చోటుచేసుకుంది. మృతుడి భార్య శ్యామలత తెలిపిన వివరాల ప్రకారం..

గణపురం మండలం బంగ్లాపల్లి గ్రామానికి చెందిన రాందాస్ నాయక్ (50) భూపాపల్లి సబ్‌జైల్‌లో ప్రాసెస్ సర్వర్‌గా పనిచేస్తున్నాడు. ఉద్యోగాల నియామకాల పేరిట అతడు డబ్బులు వసూలు చేశాడని ఇద్దరు మహిళలు అతడిపై ఆరోపణలు చేస్తూ తరచూ వేధించే వారు. ఇదే క్రమంలో రెండు ప్రధాన పత్రికలు దీనిపై వార్తా కథనాలు ప్రచురించింది. దీంతో తప్పుడు సమాచారంతో తనపై నిరాధార వార్తలు రాశారంటూ రాందాస్ తీవ్రంగా మనస్తాపం చెందాడు. ఈనెల 6న తన ఇంట్లో పురుగుల మందు తాగాడు. తీవ్ర అస్వస్థతకు గురైన అతడిని కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం వరంగల్ తరలించారు. వైద్యం అందిస్తున్న క్రమంలోనే రాందాస్ గురువారం మృతి చెందాడు.

కుటుంబ సభ్యుల రాస్తారోకో

రాందాస్ ఆత్మహత్యకు రెండు పత్రికలతోపాటు వార్తలు రాసేందుకు ప్రేరేపించిన ఇద్దరు మహిళలే కారణమని కుటుంబ సభ్యులు, బంధువులు భూపాలపల్లిలోని మంజూర్‌నగర్ వద్ద ప్రధాన రహదారిపై రాస్తారోకో చేశారు. బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మృతుడి భార్య శ్యామలత డిమాండ్ చేసింది. విషయం తెలుసుకున్న చిట్యాల సీఐ మల్లేష్ యాదవ్‌తోపాటు భూపాలపల్లి ఎస్సైలు సుధాకర్, సంధ్యారాణి, చిట్యాల ఎస్సై శ్రావణ్ కుమార్, గణపురం ఎస్సై సాంబమూర్తి అక్కడికి చేరుకున్నారు. మృతుడి బంధువులను సముదాయించే ప్రయత్నం చేశారు. అయినా ససేమిరా అనడంతో ఎస్పీ కిరణ్ ఖరేతో సీఐ మల్లేష్ ఫోన్‌లో మాట్లాడించారు. విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని ఎస్పీ హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఇదే క్రమంలో రాందాస్ నాయక్ ఆత్మహత్యకు కారణమైన ఇద్దరు మహిళలపై అతడి అల్లుడు బీమా నాయక్ గణపురం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదైందని సీఐ తెలిపారు. విచారణ జరుగుతోందని, ఇంకెవరైనా కారకులు ఉన్నట్టు తేలితే చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. మృతుడికి భార్య శ్యామలతతో కుమారుడు చరణ్, కుమార్తె యశ్విత రాథోడ్ ఉన్నారు.

వెలుగుల్లో అగ్రగామి

- నిరాటంక విద్యుత్ ఉత్పత్తిలో రికార్డు సృష్టిస్తున్న కేటీపీపీ
- తెలంగాణ రాష్ట్రంలోనే ముందంజ
- ఉద్యోగుల సమష్టి కృషితో నాన్‌స్టాప్ ప్రొడక్షన్
- ఏటా పెరుగుతున్న ప్లాంట్ లోడ్ ఫ్యాక్టర్



గణపురం, జూలై 11: విద్యుత్ ఉత్పత్తిలో కాకతీ య థర్మల్ పవర్ ప్రాజెక్టు (కేటీపీపీ) అగ్రగామిగా నిలుస్తోంది. ప్రతి ఏటా ప్లాంట్ లోడ్ ఫ్యాక్టర్ (పీఎల్ఎఫ్)ని పెంచుతూ తెలంగాణలోని విద్యుత్ థర్మల్ ప్రాజెక్టుల్లో బేషుగ్గా ఉత్పత్తిని సాధిస్తోంది. రెండు ప్రాజెక్టుల్లో విద్యుత్ ఉత్పత్తి ప్రారంభమైనప్పటి నుంచి తనదైన ముద్రవే సుకుంటోంది. థర్మల్ ప్రాజెక్టుల చరిత్రలోనే ఎలాంటి సమస్యలు తలెత్తకుండా నిరాటంకంగా విద్యుత్ ఉత్పత్తిని చేస్తూ సరికొత్త రికార్డును తిరగరాసింది. ఇటీవల సుమారు 203 రోజులపాటు రెండో దశ నాన్‌స్టాప్ ప్రొడక్షన్ చేసింది. ట్యూబ్ లీకేజీతో నిలిచిపోయినా మళ్లీ రెండు రోజుల వ్యవధిలోనే రెండో దశ విద్యుత్ ఉత్పత్తిని పునఃప్రారంభించుకుంది.

జయశంకర్ భూపాలపల్లిలో బొగ్గు నిక్షేపాలు, విద్యుత్ ఉత్పత్తికి అవసరమైన వనరులు పుష్కలంగా ఉన్నాయని గుర్తించిన 2005లో అప్పటి ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖరరెడ్డి శంఖుస్థాపన చేశారు. 2010లో మొదటి దశ 500మెగావాట్ల ప్రాజెక్టును పూర్తి చేసి విద్యుత్ ఉత్పత్తిని ప్రారంభించింది. అనతికాలంలోనే రెండో దశ 600మెగావాట్ల ప్రాజెక్టును కూడా ప్రారంభించారు. దీంతో మొత్తం 1100మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తిని కేటీపీపీ చేస్తోంది. ప్రస్తుతం తెలంగాణలో కొత్తగూడెం థర్మల్ పవర్ స్టేషన్ (కేటీపీఎస్), భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్(బీటీపీఎస్), చెల్పూరులోని కాకతీయ థర్మల్ పవర్ ప్రాజెక్టు(కేటీపీపీ) కేంద్రాల్లో మాత్రమే విద్యుత్ ఉత్పత్తి అవుతోంది. రామగుండం థర్మల్ పవర్ స్టేషన్ కాలపరిమితి ముగియడంతో జెన్కో యాజమాన్యం అక్కడ విద్యుత్ ఉత్పత్తిని నిలిపివేసింది. సింగరేణి ఆధ్వర్యంలో మంచిర్యాలలోని జైపూర్ థర్మల్ ప్రాజెక్టు విద్యుత్ ఉత్పత్తి చేస్తోంది. అయితే.. జైపూర్ థర్మల్ ప్రాజెక్టు 194 రోజులపాటు నాన్ స్టాప్ విద్యుత్ ప్రొడక్షన్ చేసి రికార్డు సృష్టించగా ఇటీవల కేటీపీపీ దాన్ని బ్రేక్ చేసింది. 203 రోజులపాటు నిరాటకంగా విద్యుత్ ఉత్పత్తి చేసి మరో రికార్డు సృష్టించింది.

ఐదళ్లుగా కేటీపీపీ మొదటి దశ 500 మెగావాట్ల ప్రాజెక్టులో ఉత్పత్తి

వార్షిక సంవత్సరం	విద్యుత్ ఉత్పత్తి	పీఎల్ఎఫ్ శాతం
2019-20	4501 మిలియన్ యూనిట్లు	71
2020-21	5480 మిలియన్ యూనిట్లు	57.43
2021-22	8374 మిలియన్ యూనిట్లు	81.87
2022-23	3166 మిలియన్ యూనిటు	72.28
2023-24	5382 మిలియన్ యూనిట్లు	85.35
2024-25	825 మిలియన్ యూనిట్లు	75.46
రెండో దశ 600 మెగావాట్లు ప్రాజెక్టులో ఉత్పత్తి		
2019-20	4464 మిలియన్ యూనిట్లు	84.70
2020-21	3386 మిలియన్ యూనిట్లు	73.94
2021-22	3556 మిలియన్ యూనిటు	67.66
2022-23	4404 మిలియన్ యూనిట్లు	83.9
2023-24	4479 మిలియన్ యూనిట్లు	85.99
2024-25	1087 మిలియన్ యూనిట్లు	82.12

సమష్టి కృషితోనే..

కేటీపీపీలో రెండు ప్రాజెక్టుల్లో కలిపి సుమారు 2,500 ఉద్యోగులు, కార్మికులు, ఆర్టిజన్లు పని చేస్తున్నారు. విద్యుత్ ఉత్పత్తిలో కింది స్థాయి ఉద్యోగుల నుంచి ఉన్నతస్థాయి ఉద్యోగుల వరకు సమష్టి కృషి వల్లే ప్రాజెక్టులో విద్యుత్ వెలుగులు విరజిమ్ముతాయి. ఉత్పత్తిలో భాగంగా కోల్ క్వాలిటీ, వాటర్, గ్రిడ్ల పనితీరు, ముడి పదార్థాల నిర్వహణ, పీరియాడికల్ మెయింటనెన్స్ చేస్తేనే ప్రాజెక్టుల్లో గణనీయమైన పీఎల్ఎఫ్ శాతం పెరుగుతోంది. 2023-24వార్షిక సంవత్సరంలో ఎక్కువ విద్యుత్ ఉత్పత్తి చేసిన థర్మల్ కేంద్రాల్లో కేటీపీపీ ఉన్నత స్థాయిలో నిలిచింది.

వచ్చే ఏడాదిలో రూ.500కోట్లతో నియోజకవర్గ అభివృద్ధి

స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

స్టేషన్‌ఘన్‌పూర్, జూలై 11: వచ్చే ఏడాదిలో రూ.500కోట్ల నిధులతో నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే కడియం శ్రీహరి పేర్కొన్నారు. డివిజన్ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించానని తెలిపారు. 15ఏళ్లలో నియోజకవర్గం అభివృద్ధి కాలేదన్నారు. 2023లో తాను గెలిచినా నియోజకవర్గం అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీలో చేరానని స్పష్టం చేశారు. ఆ తర్వాత నియోజకవర్గ అభివృద్ధి కోసం ప్రతిపాదనలను సిద్ధం చేసి సీఎంకు అందజేశానన్నారు. వాటిలో 100 పడకల ఆస్పత్రి ఏర్పాటు కోసం నిధులు, స్టాఫ్‌ను మంజూరు చేయాలని, డివిజన్ కేంద్రంలోని ఆర్టీసీ స్థలాన్ని ఆస్పత్రికి ఇవ్వాలని సీఎంకు వినతిపత్రం ఇచ్చామన్నారు. ఘన్‌పూర్ రెవెన్యూ డివిజన్ ఏర్పాటు జరిగినప్పటికీ డివిజనల్ ఆఫీసులు సరిగ్గా పని చేయడం లేదన్నారు. డివిజినల్, సబ్ డివిజినల్ మొత్తం 15 కార్యాలయాలు ఒకే చోట పనిచేసే విధంగా ఇంటిగ్రేటెడ్ రెవెన్యూ డివిజనల్ ఆఫీస్‌ల కాంప్లెక్స్‌ను (సమీకృత రెవెన్యూ డివిజినల్ కార్యాలయాల సముదాయం) నిర్మించడానికి ప్రతిపాదనలు సీఎంకు ఇచ్చానని తెలిపారు. 50వేల స్క్వేర్ ఫీట్‌ల విస్తీర్ణంతో కాంప్లెక్స్‌ను నిర్మాణం చేయాలని, 15 కార్యాలయాలు ఒకే దగ్గర ఉండి ప్రజలకు సేవలు అందించేలా ప్రతిపాదనలు ఇచ్చామన్నారు. ఘన్‌పూర్-నవాబుపేట దేవాదుల మెయిన్ కెనాల్, సబ్ కెనాల్స్ లైనింగ్‌ను ఏర్పాటు చేయాలని కోరడం జరిగిందన్నారు. నియోజకవర్గంలో 6 ప్రధానమైన ఆర్అండ్‌బీ రోడ్లను రూ 120 కోట్లతో ఏర్పాటు చేయాలని మంత్రి కోమటిరెడ్డికి వినతి పత్రం ఇచ్చానని, చిలుపూర్, వేలేరు మండల కేంద్రాలలో మండల కాంప్లెక్స్ నిర్మాణాలకు నిధులు ఇవ్వాలని పంచాయతీరాజ్‌శాఖ మంత్రి సీతక్కకు వినతి పత్రం ఇవ్వడం జరిగిందన్నారు. రూ 500 కోట్ల విలువైన వివిధ పనులు చేయాలని మంత్రులకు వినతిపత్రాలు ఇవ్వడం జరిగిందన్నారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

పక్కాగా రుణమాఫీ, రైతు భరోసా అమలు

ప్రతిపక్షపార్టీలు అనేక మాటలు మాట్లాడినా కాంగ్రెస్ ప్రభుత్వం రైతు రుణమాఫీ, రైతు భరోసాను పక్కాగా అమలు చేస్తుందన్నారు. బీఆర్ఎస్, బీజేపీలు తెలంగాణ అభివృద్ధికి సహకరించడం లేదన్నారు. గత పదేళ్ల కాలంపాటు బీజేపీ అధికారంలో ఉండి తెలంగాణకు ఒరగబెట్టిందేమీ లేదన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో సీఎం రేవంత్ రెడ్డి జాబ్ క్యాలెండర్‌ను ప్రకటించబోతున్నారని. యువతను రెచ్చగొడుతున్న బీజేపీ పదేళ్ల కాలంలో ఏ ఒక్కరికైన ఉద్యోగం ఇచ్చారా అని ప్రశ్నించారు. రాముడిపేరు చెప్పుకొని రాజకీయాలు చేసే బీజేపీ నిరుద్యోగులకు చేసిందేంటని ప్రశ్నించారు. పదేళ్ల పాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ రాష్ట్రానికి ఏమీ చేశారని ప్రశ్నించారు. ఏరకంగా ప్రభుత్వాన్ని నడిపారు ఏ రకంగా అవినీతిని పెంచి పోషించారు.. కుటుంబానికే పరిమితమైన అధికారం, కుటుంబానికే పరిమితమైన అవినితి, కుటంబానికే పరిమితమైన అహంకారం వల్లనే కదా బీఆర్ఎస్ ఓడిపోయిందన్నారు. అయిన్పటికీ జ్ఞానోదయం కావడం లేదని ఎద్దేవా చేశారు. రాజకీయ వలసలగూర్చి మాట్లాడే నైతికత కేసీఆర్ కుటుంబానికి లేదన్నారు. రాష్ట్రంలో రాజకీయపార్టీలను విలీనం చేసుకొని రాజకీయ వ్యవస్థకు విలువలు లేకుండా చేసింది, భ్రష్టుపట్టించింది మీరు ఏ ముఖం పెట్టుకొని మాట్లాడుతున్నారు వలసల గూర్చి అని ప్రశ్నించారు. మీరు చేస్తే సంసారం వేరేవాళ్లు చేస్తే వ్యభిచారమా అని ప్రశ్నించారు. ఎందుకు ద్వందనీతి అని మండిపడ్డారు. చట్టం తనపని తాను చేసుకుంటుంది తప్పకుండా కోర్టులు, స్పీకర్లు స్పందిస్తారని తెలిపారు. రాజకీయ వలసల గూర్చి స్పీకర్‌గాని కోర్టులుగాని వారి అభిప్రాయాలను చెబుతాయని హితవుపలికారు. నాశనం పట్టించిన కేసీఆర్ చివరకు ఏ ఒక్క రాజకీయ పార్టీకి ప్రాతినిధ్యం లేకుండా అసెంబ్లీలో అన్ని పార్టీల ఎమ్మెల్యేలను విలీనం చేసుకొని ప్రతిపక్షాల నోళ్లు మూయించిన మీరు ఇప్పుడు పునీతులు అయినట్లుగా తప్పుచేయని వారిగా మాట్లాడడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో నాయకులు బెలిదె వెంకన్న, నరేందర్‌రెడ్డి, నాగరబోయిన శ్రీరాములు, పార్టీ మండలాధ్యక్షుడు శిరీష్‌రెడ్డి, మామిడాల లింగారెడ్డి, భూక్య రమేష్‌నాయక్, నాగరబోయిన యాదగిరి, బూర్ల శంకర్, రాజాక్‌యాదవ్, గుర్రం రాజు, తోట సత్యం, నీల శ్రీధర్, గన్ను నర్సింహులు, నీరటి ప్రభాకర్, చింత ఎల్లయ్య, చిగురు సరిత, జ్యోతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


నర్సంపేట పోలీస్‌స్టేషన్ ఎదుట రాస్తారోకో చేస్తున్న పదహారుచింతల్ తండావాసులు

నర్సంపేటలో ఉద్రిక్తత

- 'చింతల్‌తండా' మృతుల కుటుంబానికి న్యాయం చేయాలంటూ గ్రామస్థుల రాస్తారోకో
- ఆందోళనకారులను కలెక్టర్‌తో మాట్లాడించిన డీసీపీ రవీందర్.. ఆందోళన విరమణ

నర్సంపేట టౌన్, జూలై 11: చెన్నారావుపేట మండలం పదహారు చింతల్ తండాలో యువకుడి చేతిలో హతమైన బానోతు సుగుణ, శ్రీనివాస్ కుటుంబానికి న్యాయం చేయాలని, నిందితుడికి ఉరిశిక్ష విధించాలని, అతడికి సహకరించిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలంటూ మృతుల కుటుంబ సభ్యులు, తండావాసులు నర్సంపేట పట్టణంలోని పోలీస్‌స్టేషన్, అమరవీరుల స్థూపం సెంటర్లలో గురువారం ఆందోళనలు చేశారు. ఆందోళనకారుల్లో ఓ యువకుడు పెట్రోల్ మీద పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడడం ఉద్రిక్తతకు దారితీసింది. హత్యకు గురైన దంపతులు బానోతు సుగుణ, శ్రీనివాస్ మృతదేహాలను పోలీసులు పోస్టుమార్టమ్ నిమిత్తం నర్సంపేటకు తీసుకొచ్చారు. పోస్టుమార్టం అనంతరం మధ్యాహ్నం 2గంటలకు పదహారుచింతల్ తండావాసులు, మృతుల బంధువులు, గిరిజన సంఘాలు స్థానిక పోలీస్‌స్టేషన్ వద్దకు చేరుకుని నిందితుడిని ఉరితీయాలని, అతడికి సహకరించిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని నినాదాలు చేస్తూ పోలీస్‌స్టేషన్‌లోకి చొచ్చుకుపోవడానికి ప్రయత్నించారు. స్టేషన్ ఎదుట ప్రధాన రహదారిపై బైఠాయించి ఆందోళన చేశారు. టౌన్ సీఐ రమణమూర్తి, పోలీసు సిబ్బంది వారికి ఎంత నచ్చచెప్పినా ఆందోళన విరమించలేదు. ఈ సమయంలో తండాకు చెందిన ఓ యువకుడు తన వెంట తెచ్చుకున్న పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకుంటానని హెచ్చరించడంతో అక్కడే ఉన్న పోలీసులు అతడిని అడ్డుకున్నారు. విషయం తెలుసుకున్న నర్సంపేట ఏసీపీ కిరణ్‌కుమార్ సంఘటన స్థలానికి చేరుకొని ఆందోళనకారులతో మాట్లాడినా మంత్రి సీతక్క రావాలని, కలెక్టర్ రావాలంటూ నినాదాలు చేశారు. ఆ తర్వాత అక్కడి నుంచి వరంగల్ క్రాస్‌రోడ్డులోని అమరవీరుల స్థూపం సెంటర్ వద్దకు చేరుకొని సాయంత్రం వరకు ఆందోళన చేపట్టారు. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలగడంతో పోలీసులు ట్రాఫిక్ మళ్లింపు చర్యలు చేపట్టారు. అయితే మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు పట్టణంలో రాస్తారోకో ఆందోళనలు ఎప్పుడు ఏం జరుగుతుందోనని ఉత్కంఠ వాతావరణం నెలకొంది. అమరవీరుల స్థూపం వద్ద జరుగుతన్న ఆందోళన వద్దకు చేరుకున్న డీసీపీ రవీందర్.. వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్యశారదతో సెల్‌ఫోన్ ద్వారా గిరిజన సంఘాల నాయకులతో మాట్లాడించారు. చట్ట ప్రకారం నిందితులను కఠినంగా శిక్షించడం జరుగుతుందని, బాధితులకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని కలెక్టర్ హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.


హనుమకొండలో బాధితులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

పోస్టుమార్టం గది వద్ద మిన్నంటిన రోదనలు

పోస్టుమార్టం గది వద్ద మృతుల కూతురు, కుమారుడు చేసిన రోదనలు మిన్నంటాయి. తీవ్రగాయాలతో హనుమకొండ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారు.. తల్లిదండ్రులను చివరి చూపునకు వచ్చారు. విగతజీవులుగా పడి ఉన్న తల్లిదండ్రులను చూసి కన్నీరుమున్నీరుగా విలపించారు. ఈ సంఘటనను చూసిన అక్కడికి వచ్చిన వారి కంటతడిపెట్టారు.

రూ.50లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి : పెద్ది

సుగుణ, శ్రీనివాస్ మృతదేహాలను మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి, పెద్ది స్వప్న సందర్శించి, వారి కుమారుడు, కూతురిని పరామర్శించారు. అనంతరం రాస్తారోకోకు వద్దకు చేరుకున్న పెద్ది మీడియాతో మాట్లాడుతూ.. ప్రభుత్వం మృతుల కుటుంబానికి రూ.50లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించడంతో పాటు మృతుల కూతురు, కుమారుడికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. రేవంత్‌రెడ్డి సీఎంగా పదవీ బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని ఆరోపించారు. నర్సంపేట నియోజకవర్గంలో ఈ మధ్యకాలంలో జరుగుతున్న సంఘటనలు ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నాయని, పోలీసులు, అధికారులు అధికార పార్టీ నాయకుల చెప్పులు మోసే ప్రయత్నం చేస్తున్నారే తప్ప శాంతిభద్రతలను పరిరక్షించడం లేదన్నారు. ఇక తన సొంత మండలానికి చెందిన మృతుల కుటుంబాన్ని ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి పరామర్శించకపోవడం దురదృష్టకరమన్నారు.

రూ.లక్ష సాయం అందించిన పెద్ది

బాలసముద్రం: చెన్నారావుపేట మండలం పదహారు చింతల్ తండాలో యువకుడి చేతిలో హతమైన బానోతు సుగుణ, శ్రీనివాస్ దంపతుల కూతురు దీపిక, కుమారుడు మదన్ గాయాలతో హనుమకొంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా.. వారిని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి పరామర్శించి చికిత్స కోసం రూ.లక్ష ఆర్థిక సహాయం అందించారు. నిందితుడికి వెంటనే కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఉదయం నుంచి గిరిజన సంఘాలు నిందితుడిని శిక్షించాలని నిరసనలు తెలిపినా ప్రజాపతినిధులు, అధికారులు పట్టించు కోవట్లేదని అయన విమర్శించారు. ఈ ఘటనకు ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలని ఆయన తెలిపారు. దీపిక, మదన్‌ను చికిత్స అనంతరం పెద్ది సుదర్శన్‌రెడ్డి తన వాహనంలో చెన్నారావుపేటలోని పదమారు చింతల్ తండాకు తీసుకెళ్లారు.

పోలీసుల అదుపులో నాగరాజు

వరంగల్ క్రైం, జులై 11: వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం చింతల్‌తండాకు చెందిన భార్యాభర్తలైన బానోతు శ్రీను, సుగుణల హత్య కేసులో నింధితుడు నాగరాజును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. భార్య దీప్తి కాపురానికి రావడంలో లేదనే ఆగ్రహంతో ఆమెను చంపేందుకు వచ్చి అడ్డుపడిన శ్రీను, సుగుణ దంపతులను నాగరాజు హత్య చేశాడు. హత్య చేసిన నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. నిందితుడి అరెస్టు విషయాన్ని ఈస్ట్ జోన్ డీసీపీ రవీందర్ ధ్రువీకరించారు. దీప్తి తల్లిదండ్రులపై నిందితుడు కత్తితో దాడి చేసి హత్య చేసినట్లుగా విచారణలో వెల్లడైనట్లు డీసీపీ తెలిపారు.


నర్సంపేట పోలీస్‌స్టేషన్ ఎదుట పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన యువకుడిని అడ్డుకుంటున్న దృశ్యం (సర్కిల్‌లోని వ్యక్తి)


ఆందోళనకారులతో మాట్లాడుతున్న డీసీపీ రవీందర్

యువకుడి ఉన్మాదం


పదహారు చింతల్‌తండాలో హత్య జరిగిన ప్రదేశంలో ఉన్న రక్తపు మడుగు

(5వ పేజీ తరువాయి)

దీపిక అమీనాబాద్ మోడల్ పాఠశాలలో చదువుతున్న సమయంలో నాగరాజు తన ఆటోలో ఎక్కించుకొని పాఠశాల వద్ద దింపేవాడు. ఇలా దీపిక, నాగరాజుల మధ్య పరిచయం ఏర్పడి, అది ప్రేమగా మారింది. అనంతరం డిగ్రీ కోసం హన్మకొండకు వెళ్లిన దీపిక అక్కడే హాస్టల్‌లో ఉంటోంది.

దీపికను పెళ్లి చేసుకున్న నాగరాజు..

హన్మకొండలోని హాస్టల్‌లో ఉంటున్న దీపికను గత నవంబరులో హైదరాబాద్‌లోని ఓ దేవాలంలో రహస్య వివాహం చేసుకున్న నాగరాజు హైదరాబాద్‌లోనే నివాసం ఉంటున్న తన తల్లిదండ్రుల వద్ద ఉంచాడు. వారం రోజుల తర్వాత దీపిక తల్లి సుగుణ.. హాస్టల్ ఉందనుకున్న తన కూతురు కనిపించడం లేదంటూ సుబేదారి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు చేసిన రెండు రోజుల తర్వాత తల్లిదండ్రు లను ఫోన్ చేసిన దీపిక.. తాను నాగరాజు అనే యువకుడిని వివాహం చేసుకున్నానని, ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉన్నానని చెప్పింది. దీంతో దీపిక తల్లి సుగుణ హైదరాబాద్ లోని తన కూతురు వద్దకు వెళ్లి, నచ్చ జెప్పి ఇంటికి తీసుకొచ్చింది. అప్పటి నుంచి దీపిక తల్లిదండ్రుల వద్దే ఉంటోంది.

భార్యను తన నుంచి విడదీశారని కక్ష కట్టి..

సుగుణ కూతురు దీపికను హైదరాబాద్ నుంచి ఇంటికి తీసుకువచ్చిన తర్వాత.. దీపిక, నాగరాజు ప్రేమ, పెళ్లి విషయంలో ఇటు దీపిక తల్లిదండ్రులు, నాగరాజు పరస్పరం చెన్నారావుపేట పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదులు చేశారు. దీంతో ఇరు కుటుంబాలకు పోలీసులు కౌన్సెలింగ్ నిర్వహించి, పెద్దల సమక్షంలో సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. ఆ తర్వాత పెద్ద మనుషుల మధ్య పంచాయితీ నిర్వహించగా.. దీపిక, నాగరాజు ఎవరికి వారు విడిగా ఉండాలని తీర్మానించగా.. అందుకు ఇరు కుటుంబాల వారు అంగీకరించారు. ఆ తర్వాత హైదరాబాద్ వెళ్లిపోయిన నాగరాజు.. ప్రేమించి పెళ్లి చేసుకున్న దీపికను తన నుంచి దూరం చేశారని దీపిక కుటుంబంపై కక్ష పెంచుకున్నాడు. నెల రోజుల క్రితం హైదరాబాద్ నుంచి మళ్లీ గుండెంగ గ్రామానికి వచ్చి తిరిగి ఆటో నడుపుకుంటున్నాడు. ఈ క్రమంలో పదహారు చింతల్‌తండాలో ఉన్న దీపిక ఇంటి వద్ద ఇటీవల రెక్కీ నిర్వహించాడు. పథకం ప్రకారం గురువారం తెల్లవారుజామున 1.30గంటల సమయంలో నాగరాజు వేట కత్తితో ద్విచక్ర వాహనంపై దీపిక ఇంటికి చేరుకున్నాడు. ఆ సమయంలో ఇంటి వరండాలో దీపిక, ఆమె తల్లిదండ్రులు శ్రీనివాస్, సుగుణ గాఢ నిద్రలో ఉన్నారు. ఇదే అదునుగా భావించిన నాగరాజు తొలుత సుగుణపై, ఆ తర్వాత శ్రీనివాస్‌పై, దీపికపై వేట కత్తితో విచక్షణారహితంగా దాడి చేశాడు. వారి కేకలు విని ఇంట్లో నిద్రిస్తున్న కుమారుడు మదన్‌లాల్ బయటకు వచ్చాడు. దాంతో అతనిపై కూడా నాగరాజు కత్తితో దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన సుగుణ అక్కడికక్కడే మృతి చెందింది. దీపిక, మదన్‌లాల్ కేకలు వస్తూ తప్పించుకునే ప్రయత్నం చేశారు. దాంతో చుట్టు పక్కల వారు ఇళ్ల నుంచి బయటకు వచ్చి నాగరాజును అడ్డుకునే ప్రయత్నం చేయగా వారి వైపు కత్తి చూపుతూ అడ్డొస్తే అందరినీ చంపుతా అంటూ బెదిరిస్తూ.. అక్కడి నుంచి పరారయ్యాడు. ఆతర్వాత తీవ్రంగా గాయపడిన శ్రీనివాస్‌ను నర్సంపేట ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ అతడూ మృతిచెందాడు. దీపిక, మదన్‌లాల్‌ను హన్మకొండలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. తండావాసుల సమాచారంతో ఎస్‌ఐ గూడ అరుణ్ కుమార్ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు.

పోలీసుల ఆదుపులో నిందితుడు?

జంట హత్యలకు కారకుడైన మేకల నాగరాజును పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు తెలిసింది. హత్యలు చేసి పరారైన నాగరాజు గుండెంగలోని ఓ పాఠశాలకు చేరుకుని కత్తితో చేయి కోసుకున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. వెంటనే అక్కడికి వెళ్లి నాగరాజును అదుపులోనికి తీసుకున్నట్టు సమాచారం. నాగరాజుకు సహకరించాడనే అనుమానంతో అతడి స్నేహితుడిపై తండావాసులు దాడిచేసేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారని, వెంటనే ఆ యువకుడిని చెన్నారావుపేట పోలీసు స్టేషన్‌కు తరలించారని స్థానికులు పేర్కొంటున్నారు.

గ్రామాల్లో పోలీసు బందోబస్తు

జంట హత్యల అనంతరం పదహారు చింతల్‌తండాతో పాటు గుండెంగలో వరంగల్ సీపీ ఆదేశాల మేరకు నర్సంపేట, మహబూబాబాద్‌కు చెందిన పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆయా గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకుండా చర్యలు చేపట్టారు. ఘటనా స్థలాన్ని క్లూస్ టీమ్, డాక్ స్క్వాడ్ బృందాలతో క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు. డీసీపీ రవిందర్, నర్సంపేట ఏసీపీ కిరణ్‌కుమార్, గూడూరు సీఐ బాబురావు, నెక్కొండ సర్కిల్ సీఐ చంద్రమోహన్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. గ్రామస్థుల ద్వారా హత్య జరిగిన తెలుకున్నారు. సీఐ రమణమూర్తి, ఖానాపురం ఎస్సై రఘుపతి, నర్సంపేట ఎస్సై ప్రవీణ్, గూడూరు ఎస్సై నగేష్, చెన్నారావుపేట ఎస్సై గూడ అరుణ్‌కుమార్ బందోబస్తును పర్యవేక్షించారు. ఇక దీపిక తల్లిదండ్రుల అంత్యక్రియలు గురువారం రాత్రి ముగిశాయి.

న్యాయం చేయాలని పోలీసులతో వాగ్వాదం

పదహారు చింతల్ తండాలో జంట హత్యకు పాల్పడ్డ నాగరాజును శిక్షించాలని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలంటూ తండావాసులు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. నిందితుడిని ఉరితీయాలంటూ నినాదాలు చేశారు. నాగరాజును తమకు తక్షణమే అప్పజెప్పాలని పట్టుబట్టారు. ఉదయం 10గంటల వరకు గ్రామస్థులు ఆందోళన కొనసాగించడంతో గ్రామంలో ఉద్రిక్తత నెలకొనగా బాధిత కుటుంబానికి న్యాయం చేసేలా కృషి చేస్తామని పోలీసులు హామీ ఇవ్వడంతో వారు శాంతించారు.


తండాలో సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

సర్వర్ డౌన్‌తో నిలిచిన రిజిస్ట్రేషన్లు

రాంనగర్, జులై 11: రిజిస్ట్రేషన్ శాఖ సర్వర్ డౌన్ కావడంతో గురువారం రాష్ట్రవ్యాప్తంగా ఆస్తుల రిజిస్ట్రేషన్‌లు నిలిచిపోయాయి. ఉదయం 11గంటల సమయంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆన్‌లైన్ సేవలు నిలిచిపోయాయి. దీంతో ఆస్తుల రిజిస్ట్రేషన్‌లు జరుగలేదు. హనుమకొండ జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయంలో కేవలం నాలుగు రిజిస్ట్రేషన్‌లు మాత్రమే జరిగాయి. ప్రతీ రోజు జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయంలో వంద వరకు రిజిస్ట్రేషన్‌లు జరుగుతాయి. ఆన్‌లైన్ ఇబ్బందులు తలెత్తడంతో రాష్ట్రవ్యాప్తంగా కోట్ల రూపాయల లావాదేవీలు నిలిచిపోగా, రిజిస్ట్రేషన్ శాఖకు ఈరోజు పెద్దఎత్తున ఆదాయానికి గండిపడింది. దూరప్రాంతాల నుంచి వచ్చిన క్రయవిక్రయదారులు ఇబ్బందులు పడ్డారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆన్‌లైన్ సేవలు ప్రారంభం కాకపోవడంతో తప్పని పరిస్థితిలో వెనుతిరిగారు.

27మంది ఎస్‌ఐల బదిలీ

వరంగల్ క్రైం, జులై 11: వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో భారీగా ఎస్సైల బదిలీలు జరిగాయి. వివిధ పోలీస్ స్టేషన్లలో విధులు నిర్వహిస్తున్న 27మంది ఎస్‌ఐలను బదిలీ చేస్తూ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ అయిన స్థానం
పి.శ్రీనివాస్	వీఆర్	ఐనవోలు పోలీస్ స్టేషన్
టి.ప్రశాంత్‌బాబు	ఐటీ సెల్	నల్లబెల్లి
బి.రామారావు	నల్లబెల్లి	సుబేదారి
ఎన్.వెంకటేశ్వర్లు	వంగర	దుగ్గొండి
జె.పరమేశ్వర్	దుగ్గొండి	వీఆర్
ఎన్.నగేష్	వీఆర్	నర్మెట్ట
కె.శ్రీకాంత్	నర్మెట్ట	సుబేదారి
కె.కుమార్	మట్టెవాడ	గీసుగొండ
ఎ.శ్రీకాంత్	మిల్స్‌కాలనీ	పరకాల
బి.ప్రవీణ్	నర్సంపేట	ఆత్మకూరు
బి.రాంచరణ్	వీఆర్	కేయూసీ
ఎ.సురేష్	కేయూసీ	వీఆర్
ఎస్.రాజన్‌బాబు	మహిళా పీఎస్	వరంగల్ ట్రాఫిక్
డి.సాంబయ్య	సుబేదారి	సీసీఎస్ వరంగల్
ఎం.సురేష్	హసన్‌పర్తి	మిల్స్‌కాలనీ
ఎం.రాజు	హసన్‌పర్తి	సీసీఎస్ వరంగల్
టి.కృష్ణమూర్తి	పీసీఆర్ వరంగల్	సీఎస్‌బీ వరంగల్
ఎస్‌కె.హమీద్	వీఆర్	నర్సంపేట
డి.దేవేందర్	కేయూసీ	హసన్‌పర్తి
బి.రాజేష్‌కుమార్	వీఆర్	జనగామ
ఎం.సిద్ధయ్య	వీఆర్	హసన్‌పర్తి
డి.నినిషారెడ్డి	వీఆర్	సీసీఎస్ వరంగల్
బండారి రాజు	ధర్మసాగర్	సీఎస్‌బీ వరంగల్
టి.యాదగిరి	సీసీఎస్	వరంగల్ వరంగల్ ట్రాఫిక్
ఎం.డి.నజీర్	కమిషనరేట్	సీఎస్‌బీ వరంగల్
కె.సారంగపాణి	కమిషనరేట్	సీఎస్‌బీ వరంగల్
జి.రమేశ్	కమిషనరేట్	సీఎస్‌బీ వరంగల్

ఫీడర్లపై భారం లేకుండా ఏర్పాట్లు చేయాలి

టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి

హనుమకొండ టౌన్, జూలై 11 : ఓవర్ లోడ్ భారం పడే ఫీడర్లను గుర్తించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి సూచించారు. ఎన్పీడీసీఎల్ పరిధిలోని ఉమ్మడి ఐదు జిల్లాల సర్కిళ్ల నోడల్ ఆఫీసర్లతో సీఎండీ గురువారం హనుమకొండ నక్కలగుట్టలోని కార్పొరేట్ కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ.. ట్రాన్స్‌ఫార్మర్ల ఫెయిల్యూర్ లేకుండా ఎప్పటికప్పుడు చెక్ చేసుకుంటూ ఆయిల్ లీకేజీ కాకుండా చూసుకోవాలన్నారు. పీక్ లోడ్ సమయంలో కుడా చెక్ చేయాలన్నారు. ప్రతీ పోల్‌కు నంబరింగ్ చేయాలని, ఆ నెంబర్స్ ద్వారా సమస్యలను సులభంగా గుర్తించి సమస్యలను త్వరిగతిన పరిష్కరించవచ్చన్నారు. పవర్ ఫాక్టర్‌లో మెరుగదల ఉండాలన్నారు. బ్రేక్‌డౌన్, ట్రిప్పింగ్స్ కాకుండా సబ్‌స్టేషన్ల నిర్వహణ చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జి డైరెక్టర్లు బి.అశోక్ కుమార్, సదర్‌లాల్, తిరుపతిరెడ్డి, మధుసూదన్, సీజీఎంలు కె.తిరుమల్‌రావు, కిషన్, రవీంద్రనాద్, రాజు చౌహాన్, కె.ఎస్.గుట్ట, ఎస్ఈ సివిల్ అంకూస్, కంపెనీ సెక్రెటరీ వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న వరుణ్‌రెడ్డి

డీఎస్సీని మూడు నెలలు వాయిదా వేయాలి

విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో కేయూ లైబ్రరీ ఎదుట ఆందోళన

కేయూ క్యాంపస్, జూలై 11: రాష్ట్రంలో డీఎస్సీ పరీక్షలను మూడు నెలల పాటు వాయివా వేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బినరసింహరావు డిమాండ్ చేశారు. గురువారం కేయూ లైబ్రరీ ఎదుట పీడీఎస్‌యూ, ఏబీఎస్‌ఎఫ్ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు మంద నరేశ్ నేతృత్వంలో విద్యార్థులు ప్లకార్డులు పట్టుకుని నిరసన ఆందోళనలు చేపట్టారు. ఈ సందర్భంగా నరసింహరావు, మంద నరేశ్‌లు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులు మానసిక సన్నద్ధత, ప్రిపరేషన్, సిలబస్‌లను దృష్టిలో పెట్టుకుని పరీక్షలను వాయిదా వేయాలని డిమాండ్ చేశారు. డీఎస్సీ వాయిదా కోసం ఉద్యమిస్తున్న ఓయూ విద్యార్థులపై దాడులను ఖండించారు. పోలీసుల భౌతికదాడులను విరమించుకోవాలని అన్నారు. పరీక్షలు వాయిదా వేయకపోతే విద్యార్థి సంఘాల నేతృత్వంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు అభిరామ్ రమేశ్, డీఎస్సీ అభ్యర్థులు శ్రీకాంత్‌రెడ్డి, పృథ్వీ, క్రాంతికిరణ్, శారద, మల్లేశ్, నాగరాజు, రవీందర్, లక్ష్మణ్, అనిల్, ఏబీఎస్‌ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు దార సురేశ్; కేయూఅధ్యక్షుడు దూడపాక నరేందర్, కార్యదర్శి బండారి పృథ్వీరాజ్ తదితరులు పాల్గొన్నారు.

విదేశాల్లో చదివేందుకు దరఖాస్తుల ఆహ్వానం

వడ్డెపల్లి, జూలై 11: విదేశాల్లో పోస్టు గ్రాడ్యుయేట్స్ చదివేందుకు మైనారిటీ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి మేన శ్రీను ఒక ప్రకటనలో తెలిపారు. సీఎం ఓవర్సీస్ పథకం ద్వారా అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, కెనడా, ఫ్రాన్స్, జర్మనీ, జపాన్, న్యూజిలాండ్, సింగపూర్ దేశాలలో చదువుకునేందుకు అర్హత గల అభ్యర్థులు ఆగస్టు 7వ తేదీ లోపు www.telangana epass.cgg.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్ దరఖాస్తు చేసిన అనంతరం దరఖాస్తు ప్రతులను హనుమకొండ కలెక్టరేట్‌లోని మైనారిటీ సంక్షేమ అధికారి కార్యాలయంలో సమర్పించాలని పేర్కొన్నారు.

వివాహితతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు

వేలేరు(ధర్మసాగర్), జూలై 11: వివాహితపై అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై హరిత గురువారం తెలిపారు. వేలేరు మండలం మల్లికుదుర్ల గ్రామానికి చెందిన వివాహిత తన ఇంటి వద్ద ఒంటరిగా ఉండగా, అదేగ్రామానికి చెందిన పింగిలి సంపత్‌రెడ్డి ఈనెల 9న మధ్యాహ్నం ఇంట్లోకు వెళ్లి అసభ్యంగా ప్రవర్తించాడు. దీంతో ఆమె తప్పించుకొని ఇంట్లో నుంచి తన ఇంటి పక్కనే ఉన్న తన పెద్దమ్మ ఇంట్లోకి వెళ్లింది. అక్కడే ఉన్న స్థానికుడు అనువుల ఎల్లారెడ్డి అతడిని అక్కడి నుంచి వెళ్లగొట్టాడు. దీంతో సంపత్‌రెడ్డితో తన కుటుంబానికి ప్రాణహాని ఉందని గురువారం ఫిర్యాదు చేయడంతో నిందితుడిపై కేసు నమోదు చేసినట్టు తెలిపారు.


సీఎంను సన్మానిస్తున్న కుడా చైర్మన్ ఇనుగాల

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన కుడా చైర్మన్ వెంకట్రామ్‌రెడ్డి

వరంగల్ కార్పొరేషన్, జూలై 11: కుడా చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన ఇనుగాల వెంకట్రామ్‌రెడ్డి గురువారం హైదరాబాద్ సీఎం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలి ధన్యవాదాలు తెలిపారు. సీఎంను శాలువాతో ఘనంగా సన్మానించి పుష్పగుచ్ఛాలు అందించారు. ఇంకా ప్రభుత్వ ముఖ్యసలహాదారు వేం నరేందర్‌రెడ్డి, మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాంనాయక్, నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డిలతో పాటు మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జిల్లెల్ల చిన్నారెడ్డిలను కలిసి వెంకట్రామ్‌రెడ్డి పుష్పగుచ్ఛాలు అందించారు. వారు సైతం కుడా చైర్మన్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

పోరాడి సాధించుకున్న భూములు కొనుగోలు చేయద్దు..

జేఎండబ్ల్యూపీ డివిజన్ కమిటీ కార్యదర్శి వెంకటేశ్

వరంగల్ క్రైం, జులై 11: హసన్‌పర్తి మండలం సూధన్‌పల్లి గ్రామ ప్రజలు భూస్వామి పెసలు రాంచంద్రారెడ్డితో పోరాడి సాధించి సాగుచేసుకుంటున్న భూములను ఎవరు కొనుగోలు చేయవద్దని, ఒకవేళ కొనుగోలు చేస్తే వదిలిపెట్టాలని భారత కమ్యూనిస్టు (మావోయిస్టు) జేఎండబ్ల్యూపీ డివిజన్ కమిటీ కార్యదర్శి వెంకటేశ్ ఒక ప్రకటనలో హెచ్చరించారు. నిర్బంధాలు లెక్కచేయకుండా పోరాడి రాంచంద్రారెడ్డికి చెందిన 20 ఎకరాల భూమిని ఆక్రమించి 35 యేళ్ల నుంచి 42 మంది దళితులు సాగుచేసుకుంటున్నారని ఆయన తెలిపారు. ప్రస్తుతం కాస్తులో, కబ్జాలో వీరే ఉన్నారని, రెవెన్యూ రికార్డుల్లోనూ వీరే ఉన్నారని ఆయన వివరించారు. ఆ భూముల ధరలు పెరగడంతో గ్రామానికి చెందిన తిక్క దేవేందర్ మావోయిస్టు పార్టీ పేరు చెప్పి రాంచంద్రారెడ్డి వారసులతో ఒప్పందం చేసుకుని దళితుల భూములను అమ్ముతున్నాడని అన్నారు. అమ్మడానికి ఒప్పుకోని వారిని బెదిరింపులకు గురిచేస్తూ కేసులు పెట్టిస్తున్నాడని ఆయన ఆరోపించారు. ఆ భూములు దక్కే వరకు పోరాటం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. భూస్వాములకు వ్యతిరేకంగా ప్రజలు పోరాడి ఆక్రమించుకున్న భూములను ఎవరూ కొనుగోలు చేసినా ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదని వెంకటేశ్ హెచ్చరించారు.

నేడు ఫార్మసీ విభాగంలో విస్తృత ఉపన్యాసం

కేయూ క్యాంపస్, జూలై 11: కాకతీయ యూనివర్సిటీ ఫార్మసీ కళాశాల సెమినార్‌హాల్‌లో శుక్రవారం ఉదయం 11గంటలకు క్లినికల్ ఫార్మసీ ప్రాక్టీసు- ఏ టూల్ ఫర్ బెటర్ పేషెంట్ కేర్ అనే అంశంపై విస్తృత ఉపన్యాసం ఏర్పాటు చేసినట్లు కేయూ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ నీరడి. ప్రసాద్ గురువారం తెలిపారు. కేయూ ఫార్మసీ కళాశాల పూర్వవిద్యార్థి డాక్టర్ రమేశ్ అడెపు హాజరై కీలక ఉపన్యాసం చేస్తారని పేర్కొన్నారు. పరిశోధకులు, విద్యార్థులు హాజరుకావాలని కోరారు.

రేపటి నుంచి కేయూ దూరవిద్య కాంట్రాక్టు తరగతులు

కేయూ క్యాంపస్, జూలై 11: కాకతీయ యూనివర్సిటీ దూరవిద్య కేంద్రం ఎం.ఎస్సీ బాటనీ, జువాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథమెటిక్స్ సబ్జెక్టుల మొదటి ఏడాది మొదటి సెమిస్టర్ కాంట్రాక్టు తరగతులు జూలై 13నుంచి ప్రారంభమవుతాయని దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం గురువారం తెలిపారు. కేయూ క్యాంపస్‌లోని జువాలజీ సెమినార్ హాల్‌లో తరగతులు జరుగుతాయని అడ్మిషన్లు పొందిన వారందరూ విధిగా హాజరుకావాలని కోరారు.

ఉరేసుకొని ఒకరి ఆత్మహత్య


జోగయ్య (ఫైల్)

మేడారం, జూలై 11: గొత్తికోయ వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన తాడ్వాయి మండలం ఊరట్టం గ్రామ పంచా యతీ పరిధి బాసగూడెం గొత్తికోయ గుంపులో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... మడప జోగయ్య(36)కు ఇద్దరు భార్యలు సాలక్క, కుమారి ఉన్నారు. బుధవారం రాత్రి ఇద్దరితో గొడవ జరగ్గా క్షణికావేశంతో జోగయ్య ఇంట్లో దూలానికి ఉరేసుకున్నాడు. మృతుడి కుటుంబం ఛత్తీస్‌గఢ్ నుంచి 30 ఏళ్ల క్రితం వచ్చి ఊరట్టం శివారు అడవి ప్రాంతంలో నివసిస్తోంది.

ఎదురెదురుగా ఢీకొన్న బైకులు

మహదేవపూర్, జూలై 11: మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంకు సమీపంలో గురువారం ఎదురెదురుగా రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. ఎడపల్లి గ్రామానికి చెందిన కుమ్మరి చిన్న సమ్మయ్య, కాటారం మండలం గారెపల్లికి చెందిన ఆత్కూరి పోచయ్య బైక్‌కు ఎదురుగా ఢీకొనడంతో ఇరువురి గాయపడ్డారు. వారిని మహదేవపూర్ సీహెచ్‌సీకి తరలించారు.

డాటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టుల పరీక్షకు 20 మంది హాజరు

గోవిందరావుపేట, జూలై 11: ములుగు ప్రభుత్వ మెడికల్ కళాశాలలో డాటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టుల నియామకానికి మండలంలోని పస్రా జడ్పీహెచ్‌ఎస్‌లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రానికి మొదటిరోజు గురువారం 20మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఈసందర్భంగా కలెక్టర్ టీఎస్.దివాకర పరీక్ష కేంద్రాన్ని సందర్శించి పరీక్ష నిర్వహణ తీరును పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అభ్యర్థుల అప్లికేషన్ అక్నాలెడ్జ్‌మెంట్ కార్డు, ఫొటో గుర్తింపుకార్డును పరిశీలించి ఫొటో, వేలిముద్రలను తీసుకుని అభ్యర్థులను పరీక్షకు అనుమతించాలన్నారు. మొదటిరోజు 24మంది అభ్యర్థులకు 20మంది హాజరయ్యారని, 20 నిమిషాలపాటు టైపింగ్ టెస్ట్‌లో టైపింగ్ ఆక్యురసీతోపాటు డిప్రెషన్ ఫర్ మినిట్‌ను కొలమానంగా తీసుకోవడం జరుగుతుందని అన్నారు. అభ్యర్థులకు కేటాయించిన 13,14,15తేదీల్లో టైపింగ్ పరీక్షకు హాజరుకావాలని ఆయన సూచించారు. అనంతరం కలెక్టర్ మండలంలోని రాఘవపట్నం సమీపంలోని వంతెనను పరిశీలించారు. కలెక్టర్ వెంట డాక్టర్ చరణ్, ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి, పంచాయతీరాజ్ ఈఈ అజయ్‌కుమార్, ఈడీఎం దేవేందర్, తదితరులు ఉన్నారు.

బీఆర్‌ఎస్ ఇన్‌చార్జ్‌గా శ్రీనివాస్



కాటారం, జూలై 11: బీఆర్‌ఎస్ మండల ఇన్‌చార్జిగా కాటారం గ్రామానికి చెందిన జోడు శ్రీనివాస్‌ను నియమించారు. ఈ మేరకు బీఆర్‌ఎస్ మంథని నియోజకవర్గ ఇన్‌చార్జి పుట్ట మధు నియామకపత్రం గురువారం అందజే శారు. మండలంలో కార్యకర్తలు, నాయకులు అందరినీ సమన్వయం చేసుకుంటూ బీఆర్‌ఎస్ పటిష్ఠతకు కృషి చేయాలని సూచించారు.

గిరిజన టీచర్ల బదిలీలు చేపట్టాలి

ఏటూరునాగారం రూరల్, జూలై11: గిరిజన సంక్షేమ శాఖలో విధులు నిర్వర్తిస్తున్న ఉపాధ్యాయ బదిలీలను వెంటనే చేపట్టాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పోడెం సమ్మయ్య డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ సభ్యత్వ నమోదు కార్యక్రమం గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఏళ్ల తరబడి ఉపాధ్యాయుల బదిలీలు చేపట్టకపోవడంతో అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారన్నారు. బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను ప్రభుత్వాలు గాలికొదిశాయన్నారు. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో భాషా పండితులు, ఫిజికల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయుల పోస్టులను స్కూల్ అసిస్టెంట్‌గా అప్‌గ్రేడ్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కొండ చెంచయ్య, ఎట్టి స్వరూప, మండల నాయకులు కిరణ్, పోడెం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జనాభా నియంత్రణ దినోత్సవం


ర్యాలీని పారంభిస్తున్న ములుగు డీఎంహెచ్‌వో

ములుగు కలెక్టరేట్, జూలై 11: ప్రపంచ జనాభా నియంత్రణ దినోత్సవాన్ని ములుగులో గురువారం నిర్వహించారు. ఏరియా ఆస్పత్రి ఆవరణలో అవగాహన ర్యాలీని డీఎంహెచ్‌వో అప్పయ్య ప్రారంభించారు. అనంతరం డీఎంహెచ్‌వో కార్యాలయ సమావేశ మందిరంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం ప్రపంచ జనాభా 800 కోట్లు దాటిందని, అందులో భారతదేశ జనాభా 144కోట్లు దాటిందని అన్నారు. జనాభా విపరీతంగా పెరుగుతున్న నేపథ్యంలో దానిని అరికట్టేందుకు కుటుంబ నియంత్రణ పాటించాలన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రవీందర్, డాక్టర్లు శ్రీకాంత్, సుయేషా, పవన్‌కుమార్, డెమో తిరుపతయ్య, హెల్త్ ఎడ్యుకేటర్లు సంపత్, భాస్కర్, జిల్లాలోని పీహెచ్‌సీల సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

• టేకుమట్ల: మండలంలోని వెలిశాల గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి ఆశాజ్యోతి అధ్వర్యంలో ప్రపంచ జనాభా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యురాలు మధురిమ, హెచ్ఈవో జమలుద్దీన్, హెచ్‌వీ విజయ, ఫార్మసిస్ట్ విద్యాసాగర్, హెల్త్ అసిస్టెంట్ కృష్ణారెడ్డి, సతీష్, ఏఎన్‌ఎంలు సంగీత, రాజలక్ష్మి, లావణ్య, స్వరూప, రాజేశ్వరి, మంజుల, సునీత, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

• కాటారం: మండలంలో ప్రపంచ జనాభా దినోత్సవాన్ని నిర్వహించారు. పీహెచ్‌సీ, ధన్వాడ వెల్‌నెస్ సెంటర్‌లో కుటుంబ నియంత్రణ పద్ధతులపై వైద్యులు ప్రజలు, రోగులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ డాక్టర్ వందన, సీహెచ్‌వో నిర్మల, హెచ్‌వీ పద్మావతి, స్టాఫ్ నర్సులు కృప, స్వాతి పాల్గొన్నారు.

• మొగుళ్లపల్లి: మొగుళ్లపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ నవత ఆధ్వర్యంలో గురువారం ప్రపంచ జనాభా దినోత్సవం ఘనంగా జరిగింది. ఈసందర్భంగా వైద్యులు, సిబ్బంది ఆరోగ్య కేంద్రం నుంచి మండల కేంద్రంలోని పలువీధుల్లో నినాదాలు చేస్తూ అవగాహన ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో వైద్యులు సంధ్య,విద్యాసాగర్, సూపర్‌వైజర్లు సునీత, జమున, హెల్త్ అసిస్టెంట్ భిక్షపతి, ఏఎన్‌ఎం శ్రీలత, స్టాఫ్‌నర్సులు కల్పన, సరిత, ల్యాబ్ టెక్నీషియన్ సంపూర్ణ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మేడారాన్ని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేయాలి

• ములుగు కలెక్టర్ దివాకర


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ దివాకర

మేడారం, జూలై 11 : మేడారాన్ని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని కలెక్టర్ టి.ఎస్.దివాకర అన్నారు. అదనపు కలెకర్లు శ్రీజ, మహేందర్‌జీ, పలు శాఖల అధికారులతో కలిసి గురువారం ఆయన మేడారంలో పర్యటించారు. సమ్మక్క, సారలమ్మ దేవాలయ ప్రాంగణం, క్యూలైన్లు, మంచె పరిసరాలను పరిశీలించారు. చిలకలగుట్ట, జంపన్నవాగు, ఆదివాసీ మ్యూజియం, కొంగలమడుగు, మేడారం, రెడ్డిగూడెం గ్రామాల పరిసరాలను సందర్శించారు. స్మృతివనం ఏర్పాటుకు కేటాయించిన 28ఎకరాల ప్రభుత్వ భూమిని పరిశీలించారు. సర్వే చేసి హద్దులను ఏర్పాటు చేయాలని తహసీల్దార్ రవీందర్‌ను ఆదేశించారు. అనంతరం అధికారులతో కలిసి మేడారం ఐటీడీఏ అతిథిగృహంలోని సమావేశ మయ్యారు. సమ్మక్క, సారలమ్మ దేవాలయం అభివృద్ధి, పారిశుధ్య సమస్యలపై సమీక్షించారు. మేడారం గ్రామంలో సమ్మక్క, సారలమ్మ దేవాలయ ప్రాంగణంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనుల వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ సెలవు రోజుల్లో అమ్మవార్ల దర్శనానికి వచ్చే భక్తుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో గద్దెల పరిసరాల్లో భక్తులకు సౌకర్యాలు అందుబాటులో ఉంచాలని కార్యనిర్వహణ అధికారి రాజేంద్రంను ఆదేశించారు. ప్రత్యేకంగా పారిశుధ్యాన్ని పకడ్బందీగా చేపట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో సత్యాపాల్‌రెడ్డి, రోడ్లు, భవనాల శాఖ, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖల ఇంజనిరింగ్ అధికారులు, దేవాదాయ, రెవన్యూ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బిల్ట్ భూముల సర్వేపై రైతుల అభ్యంతరం


రైతులతో మాట్లాడుతున్న అధికారులు

మంగపేట జూలై 11: మండలంలోని బిల్ట్ కర్మాగారం స్థానంలో మరో కంపెనీ ఏర్పాటు చేసేందుకు రెవెన్యూ అధికారులు గురువారం సర్వే చేపట్టారు. దీనిపై పలువురు రైతులు అభ్యంతరం చెప్పారు. బిల్ట్ ఇన్‌టేక్ వెల్ ప్రాంతంలోని సర్వే నంబర్లు 151, 298లోని భూములను సర్వే చేసేందుకు స్థానిక రెవెన్యూ అధికారులు కబ్జాలో ఉన్న 26 మంది రైతు లకు ఈ నెల 11, 12 తేదీల్లో నోటీసులను అందజేశారు. ఈ క్రమంలో సర్వే చేస్తుండగా రైతులు ఆ ప్రాంతానికి చేరుకుని ఈ భూములు తమయేనని అన్నారు. ప్రభుత్వ భూములకు సర్వే చేయడం సరి కాదని అడుకున్నారు. దీంతో కొంత సేపు వాగ్వాదం జరిగింది. తహసీల్దార్ వీరస్వామి, ఎస్సై సూరి అక్కడికి చేరుకుని రైతులతో మాట్లాడారు. రైతులు సర్వేను అడ్డుకోవద్దని, ఇవి ప్రభుత్వ భూములుగా బిల్ట్ కర్మా గారం ఆధీనంలో ఉన్నట్టు రికార్డులో ఉందని తెలిపారు. రైతులు వద్ద భూములకు సంబంధించి ఆధారాలు ఉంటే కలెక్టర్‌కు చూపాలని సూచించి సర్వేను కొనసాగించారు.

విలువలతో కూడిన విద్యను అందించాలి

భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ


విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్ శర్మ

భూపాలపల్లిటౌన్, జూలై 11: విలువలతో కూడిన విద్యను విద్యార్థులకు ఉపాధ్యాయులు అందించాలని కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. అభ్యాసన సామార్థ్యాన్ని పిల్లల్లో పెంపొందించిందేకు కృషి చేయాలన్నారు. భూపాలపల్లి పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలను ఆయన గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పిల్లలతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. అమ్మ ఆదర్శ పాఠశాలల్లో పనులు పూర్తి చేసి విద్యార్థులకు సకల సౌకర్యాలు కల్పించాలని అన్నారు. వన మహోత్సవంలో భాగంగా పాఠశాల ఆవరణలో చింత, ఉసిరి, వెలగ, కరివేపాకు, మునగ వంటి మొక్కలు నాటించాలని అన్నారు. జడ్పీహెచ్‌ఎస్‌లో తొమ్మిదో తరగతి విద్యార్థులను కలిసి మాటాడారు. కొందరు యూనిఫాం ఎందుకు వేసుకోలేదని అడిగారు. ఓ విద్యార్థి పుట్టిన రోజు సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. డిజిటల్ టీవీ పరిశీలించి వెంటనే దానిని అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత ప్రధానోపాధ్యాయులకు సూచించారు. జిల్లాలోని 10 పాఠ శాలల్లో హెచ్‌డీఎఫ్‌సీ, సీఎస్‌ఆర్ నిధులతో 10 టీవీలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. వాటి ద్వారా విద్యాబోధన జరి గేలా చర్యలు చేపట్టాలని డీఈవో రాజేందర్‌ను ఆదేశించారు. కలెక్టర్ వెంట మునిసిపల్ కమిషనర్ రాజేశ్వర్ ఉన్నారు.

గిరిజన విద్యార్థులకు ఆర్థిక సాయం

ఏటూరునాగారం రూరల్, జూలై11: ఫీజు కట్టలేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఇద్దరు గిరిజన విద్యార్థులకు కాంగ్రెస్ నాయకులు గురువారం ఆర్థికసాయం అందించారు. మండలంలోని రామన్నగూడేనికి చెందిన కోడి శశాంక, కన్నాయిగూడెం మండలం సింగారనకు చెందిన ఆలం శ్వేత నిట్‌లో ఇంటిగ్రేటెడ్ విభాగంలో బీఈడీ చదువుకుంటున్నారు. ఈ కోర్సులను కొత్తగా ప్రవేశం పెట్టడంతో వీరికి స్కాలర్‌షిప్‌లు రాక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు ధనసరి సూర్య ఒక్కొక్కరికి రూ. 25వేలు ఇవ్వగా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇర్సవడ్ల వెంకన్న ఆధ్వర్యంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చిటమట రఘు, ఎం.డి. ఖలీల్, గుండ్ల దేవేందర్, వావిరాల నర్సింగరావు పాల్గొన్నారు.

ర్యాగింగ్‌ను అరికట్టాలి

సీనియర్ సివిల్ జడ్జి జయరాంరెడ్డి


మాట్లాడుతున్న జడ్జి జయరాంరెడ్డి

భూపాలపల్లిటౌన్, జూలై 11: క్రమశిక్షణతో కూడిన విద్యను అలవర్చుకోవాలని, కళాశాలల్లో ర్యాగింగ్‌ను అరికట్టాలని సీనియర్ సివిల్ జడ్జి, న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జయరాంరెడ్డి అన్నారు. గురువారం భూపాలపల్లి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు అవగాహన కల్పించారు. కళాశాలలో ప్రతి ఒక్కరితో స్నేహభావంతో మెలగాలని సూచించారు. డ్రగ్స్‌ను అలవాటు చేసుకోవద్దని అన్నారు. చట్ట వ్యతిరేక పనులను కార్యకలాపాలకు పాల్పడితే జీవితాలు చిన్నాభిన్నం అవుతాయని అన్నారు. ఈకార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసరావు, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ప్రియాంక, న్యాయవాది వసంత, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగిన ఏఐటీయూసీ దీక్షలు

కాకతీయఖని, జూలై 11: కేంద్ర ప్రభుత్వం బొగ్గు బ్లాకులను సింగరేణికి కేటాయించాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారం ఐదో రోజుకు చేరుకున్నాయి. ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం బొగ్గు గనులను వేలం వేయడాన్ని విరమించుకుని సింగరేణి సంస్థకు కేటాయించాలని డిమాండ్ చేశారు. బొగ్గు గనుల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు రామ్‌చందర్, సికిందర్‌సింగ్, పోశం, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

బొగ్గు బ్లాక్‌లను సింగరేణికే అప్పగించాలి

చిట్యాల: బొగ్గు నిక్షేపాలు ఉన్న బ్లాక్‌లను సింగరేణికే అప్పగించాలని డీవైఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు భూక్య నవీన్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ ఆవరణలో కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈసమావేశంలో ముసాపూరి రామచంద్రయ్య, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్లకు సన్మానం



శ్రీకాంత్‌గౌడ్, బెల్లయ్య నాయక్‌ను సన్మానిస్తున్న కాంగ్రెస్ నేతలు

ములుగు కలెక్టరేట్, జూలై 11: హైదరాబాద్‌లో బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా, ఎస్టీ కోఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా ప్రమాణస్వీకారం చేసిన నూతి శ్రీకాంత్‌గౌడ్, బెల్లయ్యనాయక్‌ను గురువారం ములుగు కాంగ్రెస్ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు వంగ రవియాదవ్, నాయకులు బోయిని రాజు, కొనుపుల కుమార్, బొంతల వేణు తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీపై ఆంక్షలు విధించొద్దు : బీజేపీ

వెంకటాపూర్(రామప్ప), జూలై 11: కాంగ్రెస్ ప్రభుత్వం రైతు రుణమాఫీపై ఆంక్షలు విధిస్తే ఊరుకునేదిలేదని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు భూక్య జవహర్‌లాల్ అన్నారు. మండల కేంద్రంలో గురువారం జరిగిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీలను పక్కనబెడుతున్నారని, మాయమాటలు చెప్పి గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేస్తోందని విమర్శించారు. రైతు రుణమాఫీ, రైతుభరోసా అమలుచేయడంతోపాటు వరి ధాన్యానికి రూ.500 బోనస్ అందించాలని, వ్యవసాయ కూలీలకు రూ.12వేలు, పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.25 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈసమావేశంలో బీజేపీ నాయకులు శంకర్, ధర్మరాజు, కిరణ్, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

ఓడబలిజ సేవాసంఘం మండల అధ్యక్షుడిగా సునీల్

వెంకటాపురం(నూగూరు), జూలై 11: ఓడబలిజ సేవాసంఘం మండల నూతన అధ్యక్షుడిగా బొల్లె సునీల్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం మండలకేంద్రంలో ఓడబలిజ సేవాసంఘం సమావేశం రాష్ట్ర అధ్యక్షుడు దర్రా దామోదర్ అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా బొల్లె సునీల్‌ను మండల అధ్యక్షుడిగా, సభ్యులుగా 20మందిని ఎన్నుకున్నారు. అనంతరం పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తహసీల్దార్ వీరభద్రప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు తోట మల్లికార్జునరావు, గగ్గూరి రమేష్, నాగార్జున, శేఖర్, సమ్మయ్య, ముత్యాలరావు, విజయ్‌కుమార్, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం


రక్తదానం చేస్తున్న సుధీర్‌యాదవ్

ములుగు కలెక్టరేట్, జూలై 11: జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి జన్మదినం సందర్భంగా ములుగులోని ఏరియా ఆస్పత్రి ఆవరణలో బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు గండ్రకోట సుధీర్‌యాదవ్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం జరిగింది. ఈసందర్భంగా ఆస్పత్రి సూపరింటెండెంట్ జగదీశ్ రక్తదాన శిబిరాన్ని ప్రారంభించగా సుధీర్ యాదవ్ కేక్ కట్ చేశారు.ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

నర్సరీలను పరిశీలించిన అదనపు కలెక్టర్

మేడారం, జూలై 11 : తాడ్వాయి మండలం మేడారం, నార్లాపూర్ గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో పెంచుతున్న నర్సరీలను అదనపు కలెక్టర్ శ్రీజ గురువారం పరిశీలించారు. మొక్కల అభివృద్ధి, పెంపకం నిర్వహణ పలు అంశాలను పరిశీలించి సమస్యలను అడిగి తెలుకున్నారు. ప్రతి మొక్క వృక్షంగా ఎదిగేలా చర్యలు తీసుకోవాలని కార్యదర్శి సతీష్, ధర్మేందర్‌ను ఆదేశించారు. .

అటవీ శాఖ బీట్ అధికారులకు కౌన్సెలింగ్

కాకతీయఖని, జూలై 11: జయశంకర్ భూపాలపల్లి జిల్లా అటవీశాఖ పరిధిలో పనిచేస్తున్న బీట్ అధికారులకు గురువారం కౌన్సెలింగ్ నిర్వహించారు. డీఎఫ్‌వో వసంత, మహదేవపూర్ ఎఫ్‌డీవో వజ్రారెడ్డి కమిటీ మెంబర్లుగా వ్యవహరించారు. జిల్లాలోని తొమ్మిది రేంజ్‌ల పరిధిలో 88 మంది బీట్ అధికారులు పనిచేస్తుండగా 40శాతం మందికి కౌన్సెలింగ్ జరిగింది.35 మంది బీట్ అధికారులు కౌన్సెలింగ్‌కు అర్హత సాధించారు. వీరికి ఈ నెల 19, 20వ తేదీల్లో ట్రాన్స్‌ఫర్ ఆర్డర్లు వచ్చే అవకాశం ఉన్నట్లు అటవీశాఖ అధికారులు తెలిపారు. శుక్రవారం సెక్షన్ అధికారులకు, ఈ నెల 16 రేంజ్ అధికారులకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు.

అనారోగ్య బాధితురాలికి రూ.2.50 లక్షల ఎల్‌వోసీ

కాటారం, జూలై 11: మండలంలోని గారెపల్లి గ్రామానికి చెందిన చీమల సులోచన అనే మహిళకు రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సీఎంఆర్ఎఫ్ ద్వారా రూ.2.50 లక్షల ఎల్‌వోసీ మంజూరు చేయించారు. సులోచన బ్రెయిన్‌కు సంబంధించిన అనారోగ్యంతో హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా కుటుంబసభ్యులు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా సాయం అందించాలని మంత్రి శ్రీధర్‌బాబును కోరారు. దీంతో మంత్రి శ్రీధర్‌బాబు సీఎంఆర్ఎఫ్ నుంచి రూ.2.50 లక్షల ఎల్‌వోసీ మంజూరు చేయించగా ఆయన వ్యక్తిగత సహాయకుడు గురువారం బాధిత మహిళ కుటుంబ సభ్యులకు అందజేశారు.

సింగరేణిలో డిప్యూటేషన్లపై విజిలెన్స్ ఆరా

కాకతీయఖని, జూలై 11: సింగరేణి డిప్యూటేషన్ల వ్యవహారంపై విజిలెన్స్ కూపీలాగుతోంది. అక్రమ పద్ధతుల్లో కొంతమంది డిప్యూటేషన్లపై వివిధ విభాగాల్లో తిష్టవేసి చక్రం తిప్పుతున్నారనే ఆరోపణల నేపథ్యంలో ఓ ఉద్యోగి డైరెక్టర్ (పా)కు ఫిర్యాదు చేయడంతో విజిలెన్స్ రంగంలోకి దిగింది. ఈ వ్యవహారంపై కూపీ లాగుతుండడంతో మొత్తంగా డిప్యూటేషన్ల డొంక కదులుతున్నట్లు తెలుస్తోంది. సింగరేణి భూపాలపల్లి ఏరియాలో వివిధ విభాగాల్లో కొంతమంది ఉద్యో గులు ఉన్నతాధికారుల దన్నుతో పెద్ద ఎత్తున మామూళ్లు ముట్టజెప్పి డిప్యూటేషన్లు పొందినట్లు ఆరోపణలు వచ్చాయి. దీనిపై సంస్థలో పెద్ద ఎత్తున చర్చ జరిగింది. కొన్ని విభాగాల్లో ఇష్టారీతిన అక్రమాలకు పాల్పడి ఆర్థికంగా లబ్ధి పొందు తున్నారనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి. ఈ క్రమంలో ఓ కార్మికుడు ఈ మెత్తం వ్యవహారంపై డైరెక్టర్ (పా)కు ఫిర్యాదు చేయడంతో ఆయన దీనిపై విజిలెన్స్ విచారణకు ఆదేశించినట్లు సమాచారం. దీంతో విజెన్స్ అధికారులు రంగంలోకి దిగింది. ఈ మధ్యకాలంలో ఎవరెవరు ఏ ప్రాతి పదికన డిప్యూటేషన్లు పొందారు.. నిబంధనలను పాటించారా లేదా? తదితర అంశాలపై కూపీ లాగుతున్నట్లు తెలిసింది. అయితే.. ఇందులో చాలామంది నిబంధనలకు విరుద్ధంగా డిప్యూటేషన్లు పొందారన్న విషయం తేలినట్లు సమాచారం. ఇంకా ఈ వ్యవహారంలో ఎవరెవరి హస్తం ఉందనే కోణంలో విజిలెన్స్ డొంక లాగుతున్నట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో అక్రమంగా పోస్టింగులు పొందిన వారి, ఇచ్చిన వారి గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి.

అపరిచిత వ్యక్తులకు ఆశ్రయం కల్పించొద్దు

గోవిందరావుపేట, జూలై 11: గొత్తికోయగూడాల్లోకి వచ్చే అపరిచిత వ్యక్తులకు ఆశ్రయం కల్పించవద్దని పస్రా ఎస్సై కమలాకర్ సూచించారు. గురువారం ఆయన పోలీస్ సిబ్బందితో కలిసి మండలంలోని టేకులకుంట గొత్తికోయగూడాన్ని సందర్శించారు. ఈసందర్భంగా గొత్తికోయలతో సమావేశమై మాట్లాడారు. గూడెంలోకి కొత్త వ్యక్తులు వచ్చినట్లయితే పోలీసులకు సమాచారం అందించాలని, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినట్లయితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం గొత్తికోయల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

సొంత ఖర్చుతో డ్రెయినేజీ నిర్మాణం

కాటారం, జూలై 11: మండల కేంద్రంలోని కాటారం ఎస్సీ కాలనీ సమీపంలో వర్షపు నీరు భారీగా చేరి నిల్వ ఉండటంతో మురికినీటిని వెళ్లగొట్టడానికి మాజీ ఉప సర్పంచ్ నాయిని శ్రీనివాస్ కార్యాచరణ ప్రణాళిక చేపట్టారు. సొంత నిధులతో శాశ్వత డ్రెయినేజీ నిర్మాణం పనులను గురువారం ప్రారంభించారు. కంపుకొడుతున్న కాసారంతో ప్రజలు తమ ఇబ్బందులను తన దృష్టికి తీసుకురావడంతో సుమారు 130 మీటర్లకు పైగా నిర్మాణం చేపడుతున్నట్లు ఆయన తెలిపారు.

విద్యార్థులకు అవగాహన

మంగపేట జూలై 11: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎండీఆర్ఎఫ్ బృందం జాతీయ విపత్తుల నిర్వహణపై గురువారం అవగాహన కల్పించింది. వరదలు, భూకంపాలు, అగ్నిప్రమాదాలు, పిడుగులు తదితర విపత్తులను ఎలా ఎదుర్కోవాలని, ఎలా ముందు జాగ్రత్తలు పాటించాలని తదితర అంశాలను బృందం సభ్యులు వివరించారు. ఆకస్మిక వరదలు వచ్చినప్పుడు వాటర్ బాటిల్స్, నూనె డబ్బాలు, థర్మకోల్ షీట్స్ వంటి వస్తువులతో మనిషిని రక్షించుకునే పరికరాలను ఎలా తయారు చేసుకోవాలో ప్రదర్శించారు. పాముకాటుకు గురైనప్పుడు ఎలా ప్రాణాలు కాపాడుకోవాలో వివరించారు. కార్యక్రమంలో ఎండీఆర్ఎఫ్ ఇన్‌స్పెక్టర్ భూపేంద్ర కుమార్, నాయబ్ తహసీల్దార్ మల్లేశ్వర్‌రావు, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బండి సంజయ్ జన్మదిన వేడుకలు


చిట్యాలలో కేక్ కట్ చేస్తున్న బీజేపీ నాయకులు

చిట్యాల, జూలై 11: కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి, కరీంనగర్ పార్లమెంట్ సభ్యుడు బండి సంజయ్ జన్మదిన వేడుకలను మండల కేంద్రంలో బీజేపీ నాయకులు గురువారం ఘనంగా నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు బుర్ర వెంకటేశ్ కేక్ కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యకర్తలు బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. ఈకార్యక్రమంలో నాయకులు చెక్క నర్సయ్య, నారాయణరెడ్డి, గుండ సురేష్, పంచిక మహేష్, గజనాల రవీందర్, దశరథం, మైదం శ్రీకాంత్, రాయిని శ్రీనివాస్, స్వామి, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

● కాటారం: కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ జన్మదిన వేడుకలు మండల కేంద్రంలో ఘనంగా జరిగాయి. బీజేపీ నాయకులు, సంజయ్ అభిమానులు కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి పూసాల రాజేంద్రప్రసాద్, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి పాగె రంజిత్‌కుమార్, నాయకులు జిల్లెల్ల శ్రీశైలం, మంత్రి సునీల్, బొల్లి సూర్య తదితరులు పాల్గొన్నారు.

● మహదేవపూర్ : కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ జన్మదిన వేడుకలను మండల కేంద్రంలో బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. వెంకటేశ్వర స్వామి ఆలయంలో పూజలు నిర్వహించి కేక్ కట్ చేశారు. మొక్కలు నాటి పండ్లు, లడ్డూలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు చల్లా నారాయణరెడ్డి, మండల అధ్యక్షుడు ఆకుల శ్రీధర్, మాజీ అధ్యక్షుడు శ్రీమన్, అడప లక్ష్మీనారాయణ, ఐలయ్య, కొక్కు శ్రీనివాస్, మనోజ్, దుర్గం తిరుపతి, గోగుల రాజేశ్, అజ్మీరా వేణు, తదితరులు పాల్గొన్నారు.